క్లుప్తంగా

బస్సు కండెక్టర్ నిజాయితీ



ప్రయాణికుడు రామారావుకు పర్సును అందజేస్తున్న డీఎం నాగేశ్వరరావు

నందికొట్కూరు: నంద్యాల–నందికొట్కూరు ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న గడివేములకు చెందిన రామారావు ఆదివారం పర్సును పోగొట్టుకున్నాడు. పర్సులో రూ. 5 వేలు నగదు, ఏటీఎం కార్డు, పాన్ కార్డు ఉన్నాయి. బస్సులో పర్సును గుర్తించిన కండెక్టర్ టీఆర్ లింగయ్య డిపో సెక్యూరిటీ సిబ్బందికి అప్పగించాడు. పర్సులోని ఆధార్ కార్డు ఆధారంగా ప్రయాణికుడికి డిపో అధికారులు సమాచారం అందించారు.సోమవారం డిపో మేనేజర్ చేతుల మీదుగా అతనికి పర్సును అందజేశారు. నిజాయితీగా పర్సును అందించిన కండెక్టర్ లింగమయ్యను డీఎంఅభినందించారు. ప్రయాణికుడు ఆర్టీసీ ఉద్యోగులకు కృతజ్ఞతలు తెలిపారు.

మహానందిలో అంతర్గత బదిలీలు

మహానంది: మహానంది దేవస్థానంలో పరిపాలనా సౌలభ్యంలో భాగంగా వివిధ విభాగాల్లో పనిచేస్తున్న పలువురు ఉద్యోగుల స్థానాలను మారుస్తూ ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి సోమవారం ఆదేశాలు జారీ చేశారు. మొత్తం 13 మంది స్థానాలను మార్పు చేశారు. ఈఓ మాట్లాడుతూ ఎవరికి కేటాయించిన విధులను వారు బాధ్యతాయుతంగా నిర్వర్తించాలన్నారు. భక్తుల నుంచి ఫిర్యాదులు అందితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

భూములు కోల్పోయిన రైతులను ఆదుకోండి

ఆత్మకూరురూరల్: కల్వకుర్తి – నంద్యాల జాతీయ రహదారిలో భూములను కోల్పోయిన రైతులకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం న్యాయమైన పరిహారం ఇవ్వాలని ఏపీ రైతు సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఆకు తోట రాజశేఖర్ ఆధ్వర్యంలో రైతులు సోమవారం ఆర్‌డీఓ దాసుకు వినతపత్రం అందజేశారు. భూములు కోల్పోయిన రైతులకు బహిరంగ మార్కెట్ లో ఉన్న ధరలకు మూడు రెట్లు అదనంగా చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు వీరన్న, సంజీవరాయుడు, సుధాకర్, స్వాములు తదితరులు పాల్గొన్నారు.

అన్నదానానికి వంద కిలోల కందిపప్పు విరాళం

మహానంది: మహానంది దేవస్థానం నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి బళ్లారి పట్టణానికి చెందిన జ్యువెలరీ వ్యాపారి శ్రీనివాసులు వందకిలోల కందిపప్పును అందించినట్లు ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. సోమవారం దాతలు కందిబేడలను అందించారు. ఈఓ మాట్లాడుతూ అన్నదానం చేయడం ద్వారా ఎంతో పుణ్యఫలం దక్కుతుందన్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఓంకారం వెంకటేశ్వరుడు, అన్నదానం విభాగం ఇన్‌చార్జ్ రామశివ పాల్గొన్నారు.

కిసాన్‌మోర్చ జిల్లా ప్రధాన కార్యదర్శిగా గోపాల్‌యాదవ్

నందికొట్కూరు రూరల్: కిసాన్‌మోర్చ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శిగా మండలంలోని కోళ్లబావాపురం గ్రామానికి చెందిన గోపాల్ యాదవ్ నియమితులయ్యారు. సోమవారం బీజేపీ జిల్లా అధ్యక్షురాలు బైరెడ్డి శబరి చేతుల మీదుగా నియామకపత్రం అందుకున్నారు. కార్యక్రమంలో నంద్యాల జిల్లా ఇన్‌చార్జ్ రమేష్‌నాయుడు, రాష్ట్ర కిసాన్‌మోర్చ వైస్ ప్రెసిడెంట్ హేమసుందర్‌రెడ్డి, జిల్లా ప్రెసిడెంట్ రామక్రిష్ణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీ బృందానికి సహకరించాలి

పగిడ్యాల: 2023 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మండలంలోని 8 గ్రామ పంచాయతీలలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులపై సోషల్ ఆడిట్ నిర్వహిస్తున్న సామాజిక తనిఖీ బృందానికి సిబ్బందికి సహకరించాలని ఎంపీడీఓ వెంకటరమణ ఆదేశించారు. ఎస్‌ఆర్‌పీ, డీఆర్‌పీలకు పనులను చూపించాలన్నారు. సోమవారం స్థానిక ఉపాధి హామీ పథకం కార్యాలయంలో ఎంపీడీఓ అధ్యక్షతన సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సామాజిక తనిఖీ బృందం, ఉపాధి సిబ్బంది సమన్వయంతో సర్వే పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఈలు వెంకటేశ్వర్లు, శివకుమార్, ఏపీఓ మద్దిలేటి, ఎస్‌ఆర్‌పీ నీలకంఠ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షను విజయవంతం చేద్దాం

జూపాడుబంగ్లా: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అన్నిశాఖల అధికారులు సమన్వయంతో విజయవంతం అయ్యేలా చేద్దామని ఈఓపీఆర్డీ మధుమోహన చక్రవర్తి, డాక్టర్లు గంగాధర్, డాక్టర్ సభా అన్నారు. సోమవారం మండలంలోని తాటిపాడు గ్రామ సచివాలయంలో సచివాలయ ఉద్యోగులు, ఆరోగ్య, ఆశవర్కర్లు, వలంటీర్లతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ గ్రామంలోని ప్రజలందరూ ఆరోగ్యశిబిరంలో పాల్గొని వైద్యపరీక్షలు చేయించుకునేలా అవగాహన కల్పించాలన్నారు.

పేదలకు వరం 'జగనన్న ఆరోగ్య సురక్ష'

- ఎమ్మెల్యేలు శిల్పా చక్రపాణిరెడ్డి, తొగురు ఆర్థర్
- బావనంతపురం, ఎర్రగూడూరులో వైద్య శిబిరాలు





జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో బీపీ పరిక్షించుకుంటున్న ఎమ్మెల్యే శిల్పా, ఎర్రగూడూరులో పౌష్టికాహారం స్టాల్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే తొగురు ఆర్థర్

ఆత్మకూరు: పేదలకు వరం జగనన్న ఆరోగ్య సురక్ష అని ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డి అన్నారు. మండలంలోని బావనంతపురం గ్రామంలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా ఈ కార్యక్రమం ప్రారంభించారన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఈ కార్యక్రమాలు నిర్వహించడం వల్ల గ్రామంలోని ప్రజలకు ఏఏ వ్యాధులకు ఎలాంటి చికిత్సలు తీసుకోవాలి.. తదితర విషయాలు వెలుగులోకి వస్తున్నాయన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 3,600 జబ్బులకు ఆరోగ్య శ్రీలో చేర్చారని చెప్పారు. ప్రస్తుతం జగనన్న సురక్ష ద్వార పేదలకు వైద్య పరీక్షలు నిర్వహించడమే కాకుండా ఉచితంగా మందులు కూడా అందజేస్తున్నారన్నారు. అలాగే కంటి వైద్య పరీక్షలు నిర్వహించి కంటి అద్దాలు మంజూరు చేస్తున్నారని చెప్పారు. జిల్లా కేంద్రాల్లోని ప్రభుత్వ వైద్యశాల్లో పేదలకు గుండె జబ్బులకు సంబంధించి రూ.40 వేల ఇంజెక్షన్‌ను ఉచితంగా అందజేస్తున్నట్లు తెలిపారు.

గ్రామసచివాలయాలు దేశానికి ఆదర్శం

గ్రామ సచివాలయాలు దేశానికే ఆదర్శమని ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డి అన్నారు. సోమవారం బాపనంతపురం గ్రామంలో నూతన సచివాలయాన్ని, రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభించారు. గ్రామానికి వచ్చేసిన ఎమ్మెల్యేకు గ్రామ ప్రజలు, వైఎస్సార్‌సీపీ నాయకులు గజమాలలు, పూలమాలలు, పుష్పగుచ్ఛాలు అందించి బాణాసంచా కాలుస్తూ స్వాగతం పలికారు. ఎమ్మెల్యేను దుశ్శాలువా, పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మోహన్‌కుమార్, ఏడీఏ ఆంజనేయులు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షులు సయ్యద్‌మీర్, రాజమోహన్‌రెడ్డి, ఎంపీపీ తిరుపాలమ్మ, జెడ్పీటీసీ శంకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు రాజేష్, కొత్తరామాపురం రామచంద్రుడు, శివరాం, విజయచౌదరి తదితరులు పాల్గొన్నారు.



గ్రామసచివాలయం ప్రారంభం అనంతరం ఉద్యోగులు, వైఎస్సార్‌సీపీ నాయకులతో ఎమ్మెల్యే

నందికొట్కూరు: జగనన్న ఆరోగ్య సురక్షతో అందరికీ ఆరోగ్యమని ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ అన్నారు. సోమవారం పాములపాడు మండలంలోని ఎర్రగూడూరు గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని డాక్టర్ నాగలక్ష్మిదేవి ఆధ్వర్యంలో నిర్వహించారు. వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే సందర్శించారు. రోగులతో మాట్లాడి వైద్య సేవలెలా అందుతున్నాయని ఆరా తీశారు. అలాగే వైద్యులతో మాట్లాడారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పౌష్టికాహార ప్రదర్శనను, ప్రజలకు నిర్వహిస్తున్న వైద్య సేవలను పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలకు నిపుణులైన డాక్టర్లు వచ్చి వైద్య సేవలందించేలా చర్యలు తీసుకున్న ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. పేదలకు జగనన్న ప్రభుత్వం కార్పొరేట్ వైద్యం పైసా ఖర్చు లేకుండా అందిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్లు మౌనిక, స్పెషల్ డాక్టర్లు సుమన్, మధుకర్, శ్రావణి, ఎంపీడీఓ గోపీకృష్ణ, తహసీల్దార్ అనురాధ, ఈఓఆర్డీ శ్రీనివాసనాయుడు తదితరులు పాల్గొన్నారు.

స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాల సమర్పణ



స్వామిఅమ్మవార్లకు పట్టువస్త్రాలను తీసుకువస్తున్న మంత్రి దంపతులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలంలో వైభవంగా జరుగుతున్న దసరా నవరాత్రులను పురస్కరించుకుని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి , దేవాదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ దంపతులు స్వామిఅమ్మవార్లకు వ్యక్తిగతంగా పట్టువస్త్రాలు సమర్పించారు. సోమవారం రాత్రి శ్రీశైలం చేరుకున్న మంత్రికి ఈఓ డి పెద్దిరాజు, అధికారులు అతిథిగృహం వద్ద ఆహ్వానం పలికారు. అనంతరం మంత్రి పట్టువస్త్రాలను తీసుకుని ఆలయ రాజగోపురం వద్దకు చేరుకోగా ఆలయాధికారులు , అర్చకులు మంత్రి దంపతులకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు.

జూపూడి ప్రభాకర్‌రావుకు ఎమ్మెల్యే స్వాగతం

ఆత్మకూరు: పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో సోమవారం సామాజిక న్యాయం ప్రభుత్వ సలహాదారుడు జూపూడి ప్రభాకర్‌రావుకు నందికొట్కూరు ఎమ్మెల్యే తొగుడు ఆర్థర్ పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. అనంతరం వీరు కొత్తపల్లి మండలం వీరాపురం గ్రామంలో వివాహ వేడుకలకు హాజరయ్యారు.



ఆలయ ప్రదక్షిణలో స్వామిఅమ్మవార్లు

నవరాత్రి ఉత్సవం.. ఆధ్యాత్మిక శోభితం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ప్రతిరోజు స్వామిఅమ్మవార్లకు విశేష పూజా కార్యక్రమాలు జరుగుతున్నాయి. కుమారీ పూజ, సుహాసిని పూజ తదితర విశేష కార్యక్రమాలను నిర్విఘ్నంగా సాగిస్తున్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామిఅమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకుంటూ నీరాజనాలు సమర్పిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం భ్రమరాంబ దేవికి ప్రాతఃకాల పూజలు, విశేషకుంకుమార్చన, నవావరణార్చనలు, జపానుష్టాలు, పారాయణలు, సూర్య నమస్కారాలు, చండీహోమం, కుమారీ పూజలు జరిపించారు. ఈ సందర్భంగా కళాకారుల ప్రదర్శనలు భక్తులను ఆకట్టుకున్నాయి.







ఉత్సవంలో వివిధ కళారూపాలు



చిన్నారులకు కౌమారి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

గాయత్రీదేవి.. దీవించమ్మా



గాయత్రీదేవి అలంకరణలో కొలనుభారతిదేవి



బ్రహ్మచారిణిగా సంగమేశ్వరం శ్రీలలితాదేవి

కొత్తపల్లి: దేవినవరాత్రి వేడుకల్లో భాగంగా కొలనుభారతిదేవి ఆలయంలో రెండవ రోజు విశేషపూజా కార్యక్రమాలు నిర్వహించారు. సోమవారం అమ్మవారు శ్రీ గాయత్రీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రాంగణంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు చిన్నారులకు బీజాక్షరాలు దిద్దించి అక్షరాభ్యాసాలు చేయించారు. మండలంలోని సంగమేశ్వరం ఎగువ పుష్కర్‌ఘాట్ వద్ద ఉన్న ఉమామహేశ్వరంలో లలితాదేవి అమ్మవారు బ్రహ్మచారిని అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

ఓంకారంలో అన్నపూర్ణాదేవిగా అమ్మవారు

మహానంది: ప్రముఖ శైవక్షేత్రమైన ఓంకారంలో కొలువైన శ్రీ గంగా, ఉమాసమేత ఓంకార సిద్దేశ్వర స్వామి ఆలయంలో దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు అమ్మవారిని అన్నపూర్ణాదేవిగా అలంకరించారు.

పగిడ్యాల: దేవి శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా పాత ముచ్చుమర్రిలోని లలితా సంగమేశ్వరస్వామి ఆలయం ముస్తాబైంది. ఆలయ పురోహితులు తెలకపల్లి రఘురామశర్మ ప్రత్యేక పూజలు చేశారు. పార్వతీదేవి అమ్మవారిని బ్రహ్మచారిణి దేవిగా అలంకరిచారు.



ఓంకారంలో అన్నపూర్ణాదేవిగా ఉమాదేవి అమ్మవారు



మిడుతూరులో అన్నపూర్ణదేవీగా

నందికొట్కూరు రూరల్ : కొణిదేల గ్రామంలోని శ్రీభ్రమరాంబమల్లికార్జున స్వామి వార్ల దేవాలయంలో భ్రమరాంబాదేవీ అమ్మవారు కాత్యాయనీ దేవీ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. కోళ్లబావాపురం గ్రామంలో దుర్గాదేవీ విగ్రహాన్ని ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

జూపాడుబంగ్లా : శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రెండోరోజైన సోమవారం జూపాడుబంగ్లా గ్రామంలోని క్వార్టర్స్‌లో వెలసిన శ్రీసరస్వతీ అమ్మవారు బ్రహ్మచారిణీ రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు.

మిడుతూరు: స్థానిక కన్యకాపరమేశ్వరీ ఆలయం, చౌడేశ్వరీ దేవీ ఆలయంలో అమ్మవార్లు సోమవారం అన్నపూర్ణా దేవీ అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శణమిచ్చారు.

నందికొట్కూరు: శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరీ ఆలయంలో భక్తులందరికీ శ్రీ అన్నపూర్ణదేవి అలంకారంలో సోమవారం అమ్మవారు దర్శనమిచ్చారు. పాములపాడు మండల కేంద్రంలో శ్రీ చౌడేశ్వరిదేవి ఆలయంలో గాయత్రిదేవి అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు.



ఆత్మకూరులో శ్రీఅన్నపూర్ణాదేవిగా



వేల్పనూరులో బ్రహ్మచారిణి దుర్గ

ఆత్మకూరు: పట్టణంలోని శ్రీవాసవికన్యకపరమేశ్వరి దేవాలయంలో సోమవారం దేవినవరాత్రుల సందర్భంగా అమ్మవారు అన్నపూర్ణాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. చౌడేశ్వరి దేవాలయంలో చౌడేశ్వరి మాత శ్రీభవానీదేవిగా దర్శనమిచ్చారు.

వెలుగోడు: పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారు శ్రీ భవాని అలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. వేల్పనూరులోని అంకాల పరమేశ్వరి ఆలయంలో నవరాత్రి ఉత్సవాల సందర్భంగా అమ్మవారిని బ్రహ్మచారిని దుర్గామాత రూపంలో అలంకరించారు.

మహానంది: బండిఆత్మకూరు మండలం కాకనూరు గ్రామంలోని శ్రీ శారదాపీఠంలో పీఠాధిపతి శ్రీ శివయోంద్రీ సరస్వతిస్వామి ఆధ్వర్యంలో శారదా అమ్మవారిని శ్రీ గాయత్రీదేవిగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు.

మల్లన్నను దర్శించుకున్న ఉత్తరప్రదేశ్ మంత్రి

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబామల్లికార్జున స్వామివార్లను ఉత్తర ప్రదేశ్ రాష్ట్ర ఇండస్ట్రీయల్ డెవలప్‌మెంట్ ఎక్స్‌పర్ట్ ప్రమోషన్ శాఖ మంత్రి నంద్ గోపాల్‌గుప్త సోమవారం దర్శించుకున్నారు. వీరికి ప్రధానాలయ రాజగోపురం వద్ద ఈఓ డి.పెద్దిరాజు, అర్చకులు ఆలయమర్యాదలతో ఆహ్వానం పలికారు. అనంతరం ఆయన స్వామివారికి రుద్రాభిషేకం,అమ్మవారికి కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం అమ్మవారి ఆశీర్వచన మండపంలో అర్చక వేదపండితులు ఆశీర్వచనాలు పలుకగా, ఈఓ స్వామివార్ల శేషవస్త్రాలు, లడ్డూప్రసాదాలు, జ్ఞాపికను అందజేశారు.



ఉత్తర ప్రదేశ్ రాష్ట్ర మంత్రి నంద్‌గోపాల్ గుప్తకు జ్ఞాపికను అందజేస్తున్న దేవస్థానం ఈఓ

గిరిజన కళలను ప్రోత్సహించాలి

శ్రీశైలంప్రాజెక్ట్: చెంచుగిరిజనుల్లో చేతి వృత్తులు, జీవనోపాధుల కళలను గుర్తించి, కళాకారులను ప్రోత్సహించాలని ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి డా.బి రవీంద్రారెడ్డి అధికారులకు సూచించారు. గిరిజన కళల మేళాపై సోమవారం రాత్రి శ్రీశైలం ఐటీడీఏ కార్యాలయంలో సమీక్షా సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ.. నవంబర్ 15న నిర్వహించే గిరిజన కళల మేళాలో కళాకారులు వారి కళలను ప్రదర్శించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ ఎ.సురేష్‌కుమార్, ఉద్యాన అధికారి బీసీ ధనుంజయ, గిరిజన కో ఆపరేటీవ్ కార్పొరేషన్ డివిజన్ మేనేజర్ పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

వసతిగృహ నిర్మాణ పనుల పరిశీలన

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలం ప్రాజెక్టుకాలనీలో దేవస్థానం నిర్మిస్తున్న సిబ్బంది వసతి గృహాల నిర్మాణ పనులను సోమవారం ఈఓ డి.పెద్దిరాజు ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈఓ మాట్లాడుతూ నిర్మాణపు పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. అదే విధంగా పూర్తిగా నాణ్యత ప్రమాణాలను పాటించాలని, ఏ చిన్న పనిలో కూడా నాణ్యతా పరంగా రాజీ పడకూడదని సూచించారు. ధర్మకర్తల మండలి ప్రత్యేక ఆహ్వానితులు తన్నీరు ధర్మరాజు, ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ మురళీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టౌన్ సీఐగా ప్రకాష్‌కుమార్



నందికొట్కూరు: పట్టణంలో శాంతిభద్రతలను కాపాడేందుకు అహర్నిశలు కృషి చేస్తానని టౌన్ సీఐ ప్రకాష్‌కుమార్ అన్నారు. పట్టణ సీఐగా ప్రకాష్ కుమార్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన గతంలో తిరుపతి జిల్లాలో బాక్రాపేట పోలీసు స్టేషన్‌లో ఎస్‌ఐగా పని చేశారు. తిరుపతి వీఆర్ నుంచి పదోన్నతిపై ఇక్కడికి వచ్చారు.

చాకలి ఐలమ్మ త్యాగం స్ఫూర్తిదాయకం

జూపాడుబంగ్లా: చాకలి ఐలమ్మ పోరాటం, త్యాగం స్ఫూర్తిదాయకమని రజక సంక్షేమ సంఘం మాజీ రాష్ట్ర నాయకుడు బస్తిపాటి మౌలాలి, మండల గౌరవ అధ్యక్షుడు ఆంజనేయులు అన్నారు. సోమవారం మండలకేంద్రంలో ఐలమ్మ విగ్రహం ఏర్పాటుకు భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ రజాకార్లపై భూహక్కుల కోసం పోరాటం చేసిన వీర మహిళ ఐలమ్మ అని కొనియాడారు. ఆమెను స్ఫూర్తిగా తీసుకొని నేటి యువత, మహిళలు సమాజాభివృద్ధి కోసం పాటుపడాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు జంగాల పెద్దన్న, ఎంపీటీసీ కృపాకర్, ఆర్‌ఎంపీ ఎర్రన్న, రజక సంక్షేమ సంఘం నాయకులు రవికుమార్, లింగస్వామి, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.



ఐలమ్మ విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ చేస్తున్న రజక సంఘం నాయకులు

అరుదైన పక్షులకు నిలయం నల్లమల

మహానంది: వన్యప్రాణులకే కాదు అరుదైన పక్షిజాతులకు నల్లమల నిలయంగా మారింది. భారతదేశంలోని అతిపెద్ద టైగర్ రిజర్వ్ మరియు అనేక వన్యప్రాణుల జాతులకు నిలయమన్నది తెలిసిందే. అందులో భాగంగా నంద్యాల డీఎఫ్ఓ వినీత్‌కుమార్, కోఆర్డినేటర్ రూపక్ ఆధ్వర్యంలో ఈ నెల 14, 15వ తేదీల్లో మొదటి పక్షి సర్వే పేరుతో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. నంద్యాల–గిద్దలూరు ఘాట్‌రోడ్డులోని పచ్చర్ల వద్ద ఉన్న ఎకోటూరిజం, సమీప అడవుల్లో రెండ్రోజుల పాటు సర్వే జరిగింది. అందులో భాగంగా రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన 150 మంది ఫొటోగ్రాఫర్లు దరఖాస్తు చేసుకున్నారు. నంద్యాల డీఎఫ్ఓ వినీత్‌కుమార్ మాట్లాడుతూ కేవలం రెండు సెక్షన్ల అటవీ పరిధిలో వందకు పైగా పక్షి జాతులు ఉన్నాయన్నారు. భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు నిర్వహించి పక్షిజాతుల గుర్తింపు కార్యక్రమం చేపడతామన్నారు. సర్వేలో పాల్గొన్న ఫొటోగ్రాఫర్లకు నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, డీఎఫ్ఓ వినీత్‌కుమార్, నాయకులు కల్లూరి రామలింగారెడ్డి సర్టిఫికెట్లు అందించారు.



ఫొటోగ్రాఫర్లకు సర్టిఫికెట్లు అందిస్తున్న ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, డీఎఫ్ఓ వినీత్‌కుమార్

బాల్య వివాహాలను నిర్మూలిద్దాం

పగిడ్యాల/కొత్తపల్లి/జూపాడుబంగ్లా/మిడుతూరు/మహానంది: బాలికలకు అండగా నిలిచి బాల్య వివాహాలను నిర్మూద్దామని పగిడ్యాల సర్పంచ్ పెరుమాళ్ల శేషన్న పిలుపునిచ్చారు. సోమవారం ఐసీడీఎస్ శాఖ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు బాల్యవిహాల నిర్మూలనపై పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అలాగే కొత్తపలిలో తహసీల్దార్ చంద్రశేఖర్ నాయక్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగేశ్వరమ్మ, జూపాడుబంగ్లాలో వైకేపీ ఏపీఎం అంబమ్మ ఆధ్వర్యంలో, మిడుతూరులో ఎంపీడీఓ జీఎన్ఎస్ రెడ్డి, తహసీల్దార్ ప్రకాష్ బాబు బాల్యవిహాల వలన కలిగే అనర్ధాలాపై అవగాహన కర్యాక్రమాలు నిర్వహించారు. అలాగే 'నేను నా కుటుంబంలో ఆడిపిల్లకు 18ఏళ్లు, మగపిల్లలకు 21ఏళ్లు నిండకుండా వివాహం చెయ్యను, బాల్య వివాహాలలో పాల్గొనను' అంటూ మహిళలు బండిఆత్మకూరు మండలం పార్నపల్లె గ్రామంలో గ్రామ సర్పంచ్ షేక్ షబ్బీర్ అహ్మద్ ఆధ్వర్యంలో ప్రతిజ్ఞ కార్యక్రమం చేపట్టారు.

వన్యప్రాణి వేటగాళ్ల అరెస్టు



అటవీ అధికారులకు పట్టుబడిన వన్య ప్రాణి వేటగాళ్లు

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు అటవీ డివిజన్ పరిధిలోని కొత్తపల్లె మండలం కృష్ణాతీరంలోని బలపాల తిప్ప సమీపంలో ఇటీవల కణితిని చంపి, మాంసాన్ని విక్రయించేందుకు యత్నించిన నలుగురు వన్యప్రాణి వేటగాళ్లను అటవీ అధికారులు సోమవారం అదుపులోకి తీసుకున్నారు. గతంలో ఒకరు కణితి మాంసంతో పట్టుబడగా చిన్న బాలయ్య, రాజు, బయన్న, గోపాల్ పారిపోయారు. ఎట్టకేలకు సోమవారం వారు అధికారులకు చిక్కారు. వీరిని ఆత్మకూరు జుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరు పరచగా.. ఆయన వారికి ఈ నెల 30 వరకు రిమాండ్ విధించినట్లు ఆత్మకూరు అటవీక్షేత్రాధికారి పట్టాభి తెలిపారు. ఈ కేసులో శ్రమించిన డిఫ్ఎస్ఓ నాగేశ్వరరావు, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ సి.పాములేటి, స్ట్రయికింగ్ ఫోర్స్ అధికారులు, ప్రొటక్షన్ వాచర్లను అభినందించారు.

ఎస్సీ, ఎస్టీ కేసుపై డీఎస్పీ విచారణ

మిడుతూరు: మండల పరిధిలోని నాగలూటి గ్రామానికి సోమవారం ఆత్మకూరు డీఎస్పీ శ్రీనివాసరావు చేరుకొని ఎస్సీ, ఎస్టీ కేసుపై విచారణ చేపట్టారు. ఈ కేసు విచారణ అనంతరం పోలీస్ స్టేషన్‌కు చేరుకొని స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. కార్యక్రమంలో నందికొట్కూరు రూరల్ సీఐ విజయభాస్కర్ ఉన్నారు.

ప్రశాంత జీవనాన్ని అలవర్చుకోండి

జూపాడుబంగ్లా: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు ఎలాంటి అలజడులకు తావు లేకుండా ప్రశాంత జీవనాన్ని అలవర్చుకోవాలని ఎస్ఐ మారుతిశంకర్ తెలిపారు. సోమవారం మండలంలోని పి.లింగాపురం గ్రామంలో గ్రామసభ నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ ఏదేని సమస్యలు తలెత్తినప్పుడు వాటిని సామరస్యంగా పరిష్కరించుకోవాలన్నారు. ఆవేశానికిలోనై ఘర్షణలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో గ్రామసర్పంచ్ నాగార్జునరెడ్డి, గ్రామప్రజలు పాల్గొన్నారు.

వాహనదారులకు లైసెన్స్ తప్పనిసరి

ప్రతి వాహన దారుడు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని ఎస్ఐ మారుతిశంకర్ అన్నారు. పోలీసుస్టేషన్ పరిధిలో కేజీ రోడ్డుపై వెళ్లే వాహనాలను తనిఖీ చేశారు. సరైన పత్రాలులేని వారికి జరిమానాలు విధించారు.

మహానందిలో రుద్ర, చండీ హోమాలు

మహానంది: దసరా శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మహానందిలో రెండో రోజు సోమవారం పూజలు వైభవంగా జరిగాయి. మహానంది మండల అధ్యక్షురాలు బుడ్డారెడ్డి యశస్విని, నంద్యాలకు చెందిన అత్రివనం రాజారావు, గజ్జల మహేశ్వరరెడ్డి, పాణ్యం గ్రామానికి చెందిన నిడిగల్లు వసంత కుమార్‌లు ఉభయదాతలుగా పాల్గొన్నారు. నంద్యాల పట్టణంలోని విశ్వనగర్ కాలనీకి చెందిన శ్రీకృష్ణ, శ్రీగాయత్రి భజనమండలి కళాకారులు ప్రముఖ భజన గురువు బొల్లవరం రాముడు ఆధ్వర్యంలో భజన కార్యక్రమాలు చేపట్టారు.